RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

హైదరాబాద్
16-8-2023
సంపుటి:08
సంచిక: 345
పేజీలు: 4
వెల: రూ.5/-

CEO & Editor: G. PRUDHVIRAJ

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

SAMA SAMAJAM TELUGU DAILY

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## వారసులు రెడీ

- వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా సుమారు 30 మంది
- అధినేతకు వినతిపత్రాలు సమర్పిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు
- తలసాని కుమారుడు సాయి, మల్లారెడ్డి అల్లుడు మర్రి అసెంబ్లీకి ?
- తనతో పాటు కుమారుడికీ టికెట్ అడుగుతున్న మైనంపల్లి
- తనకు విరామం ఇచ్చి వారసుడికి చాన్స్ ఇవ్వాలని కోరుతున్న బాజిరెడ్డి
- హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా గెలుపు గుర్రాలపై కేసీఆర్ కసరత్తు
- త్వరలో జాబితా విడుదలకు సన్నాహాలు... ఆశావహుల్లో ఉత్కంఠ



3లో

## ట్రంప్‌పై మరో తీవ్రమైన అభియోగం

వాషింగ్టన్: రెండోసారి అమెరికా అధ్యక్షునిగా ఎన్నికయ్యేందుకు అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి జార్జియా రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని డొనాల్డ్ ట్రంప్‌పై అమెరికా గ్రాండ్ జ్యూరీ అభియోగాలు నమోదుచేసింది. మరోసారి అధ్యక్షపీఠంపై కూర్చుకునేందుకు తహతహలాడుతున్న ట్రంప్‌పై అభియోగాలు నమోదవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఫుల్టన్ కౌంటీ గ్రాండ్ జ్యూరీ సోమవారం తన 41%--%చార్జ్ అభియోగాల పత్రంలో సంబంధిత వివరాలను పొందుపరిచింది. ట్రంప్‌తోపాటు మరో



## అగ్ర పథానికి 5 వ్యూహాలు!

- విశాఖలో డాక్యుమెంటును
- విడుదల చేసిన చంద్రబాబు
- ప్రపంచానికి కావలసిన
- ఉద్యోగాల కోసం భారత్‌లో శిక్షణ
- అంతర్జాతీయ స్థాయికి మన కంపెనీలు
- కుటుంబం ప్రామాణికంగా
- వనరులు, అవకాశాల పెంపు
- హరిత ఇంధనంతో ఇంధన భద్రత
- ప్రపంచ సారథ్యం కోసం
- నిర్దిష్ట లక్ష్యాలు పెట్టుకోవాలి
- దేశం బాగుండాలి.. తెలుగువారు
- అగ్ర జాతిగా ఉండాలి
- ప్రతి ఒక్కరికీ విజన్ అవసరం: బాబు



3లో



3లో

## కచ్చితత్వం.. పారదర్శకం

### ఇక ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్ సేవలు

- సొసైటీలు, సంస్థలు, వివాహాల రిజిస్ట్రేషన్లను
- ఆఫీసుకు వెళ్లకుండానే చేసుకునే అవకాశం
- వినతులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించిన రిజిస్ట్రేషన్ల శాఖ
- త్వరలో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు ఆన్‌లైన్‌కు అవకాశం

సాంప్రదాయాన్ని

## బ్రేక్ చేసిన ఖర్గే....

సోనియా గాంధీ హయాంలో ఇలా జరగలే..!



ఢిల్లీ: ఎర్రకోట వద్ద జరుగుతున్న స్వాతంత్ర్య వేడుకలకు హాజరుకాని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తన సొంత నివాసంలో జాతీయ జెండాను ఎగురవేశారు. పార్టీ

# మళ్లీ నేనే!

- అవినీతి, వారసత్వం, బుజ్జగింపు రాజకీయాలను అంతం చేస్తాం
- వచ్చే ఐదేళ్లలో మూడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్
- ఓబీసీ చేతివృత్తిదారులకు 13-15 వేల కోట్లతో విశ్వకర్మ యోజన
- మధ్యతరగతి సొంతింటి కల సాకారానికి త్వరలోనే కొత్త పథకం
- తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు.. దీంతో వారికి రూ.లక్షలు ఆదా
- 'లఖ్‌పతి దీదీ'తో 2లక్షల మంది మహిళలను లక్షాధికారుల్ని చేస్తా
- 6జీ టెక్నాలజీ దిశగా వేగంగా అడుగులు: ప్రధాని నరేంద్ర మోదీ
- ఎర్రకోట వేడుకల్లో పాల్గొన్న హైదరాబాద్ ఉపాధ్యాయురాలు



న్యూఢిల్లీ: వచ్చేసారి కూడా అధికారం తమదేనని.. 2024 ఎన్నికల్లోనూ నెగ్గి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎర్రకోట సాక్షిగా చెప్పకనే చెప్పారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎర్రకోటపై పతాకావిష్కరణ చేసిన ప్రధాని.. వచ్చే ఏడాది ఆగస్టు 15న కూడా ఎర్రకోట నుంచి తాను ఇదే విధంగా దేశం సాధించిన విజయాల గురించి ప్రజలకు చెప్తాననడం ద్వారా మరోసారి ప్రధాని పదవి చేపడతానని పరోక్షంగా చెప్పినట్లయింది. దాదాపు గంటన్నరకు పైగా సాగిన ప్రసంగంలో మోదీ తమ

3లో





# ఆశీర్వదించండి!

- రాష్ట్ర పురోగమనం కొనసాగేలా ప్రజలు సంపూర్ణ బలాన్ని ఇవ్వాలి
- ముఖ్యమంత్రి కేసీఆర్ విజ్ఞప్తి
- సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం సువర్ణాధ్యాయాన్ని లిఖిస్తోంది... నిరంతర విద్యుత్తు వెలుగులు,పంట కాల్వలు, పచ్చని చేలతో కళకళలాడుతోంది
- ప్రధాన అభివృద్ధి సూచికల్లో దేశంలోనే అగ్రస్థానం
- గృహలక్ష్మి కింద ప్రతి నియోజకవర్గంలో 3 వేల మందికి లబ్ధి చేకూరుస్తాం... త్వరలో కొత్త పీఆర్సీ.. వేతనాలు పెంచే వరకు మధ్యంతర భృతి
- తెలంగాణ అపూర్వ ప్రగతిని చూసి యావద్దేశం సంభ్రమాశ్చర్యాలకు గురవుతోంది
- దేశం మాత్రం ఇప్పటికీ పేదరికంలోనే మగ్గుతోంది

గోల్కొండపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్: 'తెలంగాణ నేడు నిరంతర విద్యుత్తు వెలుగులు, పంట కాల్వలు, పచ్చని చేలతో కళకళలాడుతోంది. మండే ఎండల్లో సైతం చెరువులు మత్తడి దుంకుతున్నయి. చెక్ డ్యాములు నీటి గలగలలతో తొణికిసలాడుతున్నాయి. కాళేశ్వర జలధారలతో గోదావరి సతత జీవధారయై తెలంగాణ భూములను తడుపుతోంది. ఇరవైకి పైగా రిజర్వాయర్లతో తెలంగాణ పూర్ణకలశం వలె తొణికిసలాడుతోంది. దేశానికి అన్నంపెట్టే అన్నపూర్ణగా విలసిల్లుతోంది. సంక్షేమం, అభివృద్ధిలో సువర్ణాధ్యాయాన్ని లిఖిస్తోంది. తెలంగాణ అపూర్వ ప్రగతిని చూసి యావద్దేశం సంభ్రమాశ్చర్యాలకు లోనవుతోంది. ఈ పురోగమనం ఇదే రీతిన కొనసాగే విధంగా రాష్ట్ర ప్రజలు తమ సంపూర్ణమైన ఆశీర్వాద బలాన్ని అందించాలి..'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తి చేశారు. దేశ 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన గోల్కొండ కోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. పదేళ్ల కిందటి

3లో

# సంపాదకీయం

## ఉపాధిహామీపై సర్కారును తూర్పారబట్టిన స్టాండింగ్ కమిటీ!

గ్రామీణాభివృద్ధి శాఖ 'పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ' జూలై 27న తన 33వ నివేదిక పార్లమెంటుకు సమర్పించింది. ఈ నివేదికలో కమిటీ 21 అంశాల గురించి ప్రస్తావించింది. అందులో ఐదు అంశాల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పని తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ఈ ఐదింటిలో నాలుగు 'నరెగా చట్టం' అమలుకు సంబంధించినవి. మిగిలిన ఒక్క అంశం గ్రామీణ రోడ్ల నిర్వహణకు సంబంధించింది. కమిటీ ఆక్షేపించిన అంశాల్లో మొదటిది: నరెగా చట్టం అమలులో బడ్జెట్ కోతలు. నరెగా అమలుకు 2022%--%23కి సవరించిన అంచనాలతో పోల్చినప్పుడు 2023%--%24కి రూ.29,400 కోట్లు తక్కువ కేటాయించడాన్ని కమిటీ ప్రశ్నించింది. ఐతే 2023%--%24 కేటాయింపుల్ని నిధుల కోతగా చూడకూడదని, అదనపు నిధులు అవసరమైనప్పుడు వాటి కోసం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను అభ్యర్థిస్తామని గ్రామీణాభివృద్ధి శాఖ సమాధానం ఇచ్చింది. అలానే చట్టం మార్గదర్శకాల ప్రకారం నరెగా సరైన అమలు కోసం వేతనం, మెటీరియల్ చెల్లింపుల కోసం రాష్ట్రాలకు నిధులను విడుదల చేయడానికి కేంద్రం కట్టుబడి ఉందని గ్రామీణాభివృద్ధి శాఖ అన్నది. అయితే ఈ వాదనల్ని కమిటీ తోసిపుచ్చింది. ఈ సంవత్సరపు ప్రతిపాదిత డిమాండ్ రూ.98,000 కోట్లు కాగా రూ.60,000 కోట్లు మాత్రమే ఎందుకు కేటాయించారని కమిటీ ప్రశ్నించింది. అసలు ప్రతిపాదిత డిమాండును రూ.98వేల కోట్లుగా ఎలా నిర్ణయించారని నిలదీసింది. అలానే గ్రామీణాభివృద్ధి శాఖ సమాధానం మూసపద్ధతిలో%--%ఖచ్చితమైన సమాచారం లేకుండా ఉందని 'కమిటీ' అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆర్థిక శాఖ నుంచి నిధుల కేటాయింపు పెంచడం కోసం గ్రామీణాభివృద్ధి శాఖ ఎలాంటి ప్రణాళికనూ చూపలేకపోయిందని విమర్శించింది. నిధులు కొరతతో కొత్త ప్రాజెక్టులు చేపట్టడంలో ఆటంకానికి, వేతన చెల్లింపులలో జాప్యానికి దారి తీస్తుందని కమిటీ అభిప్రాయపడింది. రెండో అంశంగా వేతన బకాయిలు, మెటీరియల్ బకాయిల చెల్లింపులలో జాప్యం గురించి కమిటీ ప్రస్తావించింది. వివిధ రాష్ట్రాలలో నరెగా పథకం కింద వేతనాలు, మెటీరియల్ ఖర్చుల కోసం కేంద్ర వాటా నిధుల పంపిణీలో నిరంతర పెండింగుపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. దానికి గ్రామీణాభివృద్ధి శాఖ సమాధానం చెబుతూ నరెగా కార్యక్రమం డిమాండ్%--% ఆధారిత వేతన ఉపాధి కార్యక్రమమని, అందులో రాష్ట్రాలకు నిధుల విడుదల నిరంతర ప్రక్రియ అని అన్నది. అలానే ఆమోదించబడిన లేబర్ బడ్జెట్‌లు, ప్రారంభ బ్యాలెన్స్, మునుపటి సంవత్సరం పెండింగ్ పేమెంట్లు తదితర అంశాల ఆధారంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిధులు విడుదల చేస్తుందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ ఆధారంగా మెటీరియల్, పరిపాలనా నిధులు విడుదల జరుగుతుందని కమిటీకి తెలియజేసింది. ఈ సమాధానంతో కమిటీ సంతృప్తి చెందలేదు. గ్రామీణాభివృద్ధి శాఖ ఇచ్చిన సమాధానం తన బాధ్యత నుంచి తప్పించుకునే, రాష్ట్రాలను నిందించే విధంగా ఉందని కమిటీ అభిప్రాయపడింది. రాష్ట్రాలతో సమన్వయం మెరుగుపర్చడం ద్వారా సకాలంలో నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని గ్రామీణాభివృద్ధి శాఖకు కమిటీ సూచించింది.



## ఉత్తమ పశువైద్యురాలుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న డాక్టర్ పి ప్రసన్న



**రంగారెడ్డి ఆగస్టు 15/సమ సమాజం:** 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నందు జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి చేతుల మీదుగా ప్రతిభవంతమైన సేవల ద్వారా చేసిన విశిష్ట కృషిని గుర్తిస్తూ 2022-2023 సంవత్సరానికి గాను ఉత్తమ పశు వైద్యురాలిగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న డాక్టర్ పి. ప్రసన్న ఈ కార్యక్రమంలో రంగారెడ్డి కలెక్టర్ హరీష్,రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏబీఎన్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ అంజిలప్ప పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రసన్న మాట్లాడుతూ నోరులేని జీవాలకు వైద్యం చేయడం ఒక అదృష్టంగా భావిస్తూ తను చేస్తున్న సేవను గుర్తించి ప్రభుత్వం అందించిన ప్రోత్సాహానికి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## శ్రీకాంతాచారి కి ఘన నివాళులు

**ఎల్బీనగర్ ఆగస్టు 15/సమ సమాజం::** శ్రీకాంతాచారి జయంతి సందర్భంగా ఎల్.బి.నగర్ కామినేని దగ్గర ఉన్న వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి .ఇట్టి కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి,మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు,జగదీష్ యాదవ్,రుద్ర యాదగిరి నేత,రామాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ నియోజకవర్గంలో 77వ స్వాతంత్ర దినోత్సవం

**ఎల్బీనగర్ ఆగస్టు 15/సమ సమాజం:**77 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఎల్బీనగర్ నియోజక వర్గంలోని పలు డివిజన్ లలో నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీవాసులచే కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసి నియోజక ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు,మహిళా అధ్యక్షురాళ్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వీరి సేవ బూటకం!

# మునుగోడులో దళారుల నాటకం

## విద్యావంతులకు, మేధావులకు రాజ్యాధికారం కావాలే

### డబ్బుల మూటలు ఉంటేనే టికెట్ ఇచ్చేలా జాతీయ పార్టీల దిగజారుడు రాజకీయాలు !

### ప్రజలు మారాలి.. ఓటు చైతన్యం రావాలి

కొన్ని ప్రధాన పార్టీలు పెట్టుబడిదారులకు పెంపుడు హస్తాలుగా మారుతున్నాయి. బడా కాంట్రాక్టర్ల స్వప్రయోజనాలకోసం ఆయా జాతీయ పార్టీలకు భారీ మొత్తంలో విరాళాలను చెల్లించి పార్టీ టికెట్‌లను రిజర్వ్ చేసుకొని రాజ్యమేలాలని పరితపిస్తుంటారు. నిజానికి పార్టీనే తమ ఊపిరిగా పనిచేసే నికార్సైన నేతలు ఆయా జిల్లాల్లో ఉన్నారు. కాని వారికి టికెట్ కెటాయించడంలో సుముఖత చూపకపోవడానికి డబ్బే ప్రధాన కారణం. ప్రధాన పార్టీలకు కావలసింది డబ్బు తప్పా.. ప్రజాశ్రేయస్సు కాదు. ప్రజలకు ఉపయోగపడే నాయకులు కాదు. పార్టీ అధికారంలోకి రావడం ఒక్కటే లక్ష్యం. అందుకు ఎంతవరకైనా దిగజారుతున్నారు. నిజానికి ప్రజలకు సారథ్యం వహించాలంటే, ప్రజల కష్ట నష్టాలు తెలిసినోడై ఉండాలి. ప్రజలలో నుంచి పుట్టిన నాయకునికే అది సాధ్యం. అప్పుడే సామాన్యుడు సహితం ఎమ్మెల్యే, ఎంపీలుగా ఉద్భవిస్తారు. అందుకు ప్రజలు మారాలి. ఓటు చైతన్యం రావాలి. అప్పుడే ప్రతి సామాన్యుడు, విద్యావంతుడు సహితం చట్టసభలకు వెళ్లగలడు.

### దొందు దొందే !

డబ్బున్న నేతలను బుజాన మోసే మునుగోడు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతీసారి మోసపోతూనే ఉన్నారు. గతంలో ఉపఎన్నికల ముందే రాజగోపాల్‌రెడ్డి మోసం చేయబోతుండు అని సమ సమాజంలో వార్తా కథనాలు ప్రచురించాం. అదే నిజమైంది కదా !. అలాగే ప్రస్తుతం చల్లమల్ల అనే కాంట్రాక్టరు కల్లబొల్లి మాటలు చెప్పి తప్పని పరిస్థితుల్లో మరో పార్టీలోకి మారే అవకాశం ఉందని సంకేతాలు వెలుబడుతున్నాయి. ఇదే వాస్తవం అయితే మరో కాంట్రాక్టర్ చేతిలో మోసపోవడం మునుగోడు కాంగ్రెస్ కార్యకర్తల వంతు అవుతుంది.



*ఎన్నికల సమయానికి కొన్ని పార్టీల కార్యకర్తల ఆలోచన భిన్నంగా ఉంటుంది. డబ్బులు జల్లుతేనే మా నాయకుడు గెలుస్తాడు అని కొందరు అభిప్రాయపడితే, డబ్బున్న నాయకుడే మా పార్టీ తరపున నిలబడాలి అని మరి కొందరు భావిస్తున్నారు. ఎలాంటి ప్రలోభాలకు తావివ్వని నాయకుడు కావాలని ఎవ్వరు కోరుకోవడం లేదు. ప్రజలే అలాంటి వారికి బ్రహ్మరథం పడుతుంటే వారిని ఎవరు మాత్రం రక్షిస్తారు. ఇలాంటి కోవాకు చెందిన నాయకులను భుజాన మోస్తూ భక్తిపారవశ్యమౌతున్నారు.కాంగ్రెస్ పార్టీలోకి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెరబోతున్నాడని తెలవడంతో కొందరిలో ఆనందం ఉరకలేస్తుంది. అదేంటో కాని మాకు రాజ్యాధికారం రావాలనే వారు లేకపోగా, మా నాయకుడే ఎమ్మెల్యే అభ్యర్థి అవ్వాలని తొడలు కొట్టుకునే వారే మిక్కిలిగా ఉన్నారు జనం.*

**నల్లగొండ, ఆగస్టు 15 (సమ సమాజం):** గతంలో కాంగ్రెస్ పార్టీని మోసం చేసి, కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని వదిలి బీజేపీ పార్టీలో చేరడం, ఆ తరువాత పదవుల కోసం కాంగ్రెస్‌లోకి రావడం ఈ దళారులకే సాధ్యమౌతుంది. రాజగోపాల్‌రెడ్డి ఒక్కడే అనుకుంటే పొరపాటే. అదే కోవాకు చెందిన మరో వ్యక్తి మునుగోడు నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీని రక్షించడానికి వచ్చాను అని చెప్పే చల్లమల్ల కృష్ణారెడ్డికి టిపిసిసి ప్రధాన కార్యదర్శి పదవిని ఎలా కట్టబెట్టింది. పట్టుమంటే సంవత్సరకాలం సభ్యత్వం కూడా లేని కృష్ణారెడ్డికి ఎమ్మెల్యే టికెట్ నాదే అని చెప్పుకోవడం దేనికి సంకేతం. దేశంలో పెట్టుబడిదారులకు, దళారులకు ఆయా పార్టీలు రెడ్ కార్పెట్ వేసి మరీ టికెట్‌లు ఇస్తున్నాయి.

### జాతీయ పార్టీలు దళారులకే మొగ్గ

ప్రజలలో పుట్టి, ప్రజలకోసం పని చేసిన ఆయా సబ్బండ వర్గాలలో గల ఎస్సీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణాలుగా చెప్పుకోబడే పేదల పరిస్థితి ఏంటి. వారికి రాజ్యాధికారం దక్కకుండా కొన్ని జాతీయ పార్టీలు దళారులకు, పెట్టుబడిదారులకు దాసోహం అవుతున్నాయి. మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాలలోకి వస్తే..., తన కుటుంబం కాంగ్రెస్ పార్టీకి అంకితమై జీవిత కాలం పని చేసి అక్రమ సొమ్ము సంపాదించకుండా దివంగత పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని మునుగో డులో బతికించుకున్నారు. ఆ తరువాత తన కూతురు పాల్వాయి స్రవంతి మునుగోడు కాంగ్రెస్‌ను తన బుజాలమీద వేసుకున్నారు. నిజానికి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి అక్రమాలకు పాల్పడి, దండీగా డబ్బు, ఆస్తులు సంపాదించి ఉంటే పాల్వాయి స్రవంతికి ఎదురు లేకుండా పోయేది. కాని ఆనాటి కాలంలో విలువలతో కూడిన రాజకీయాలు చేశారు కాబట్టి అక్రమాలకు పాల్పడలేదు. అందుకు నిదర్శనం.. పాల్వాయి స్రవంతి దగ్గర డబ్బు లేదు అనే ఒకే ఒక సాకుతో దూరం పెట్టే ప్రయత్నం అదిష్టానంలో ఓ ముఖ్యనేత చేస్తు న్నారు. అంతెందుకు మునుగోడు నియోజక వర్గంలో ఓ వర్గం కార్యకర్తలు అసమ్మతిగా ఉండటానికి ప్రధాన కారణం డబ్బు కారణం తప్పా, మరొకటి కాదు. మరో నేత ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గలమెత్తిన పున్న కైలాష్ నేత ఓ బీసీ బిడ్డ. దిగువ మధ్యతరగతిలో కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదివిన విద్యార్థి నేత. ప్రస్తుతం టి.కాంగ్రెస్‌లో కీలక నేతగా మారారు. ఇలాంటి వారికి టికెట్ ఇచ్చేందుకు బరోసా ఇవ్వకపోవడానికి ప్రధాన కారణం డబ్బు మాత్రమే. కాంగ్రెస్ పార్టీ డబ్బే ప్రధానంగా చేసుకొని టిక్కెట్లు ఇస్తే ఎస్సీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణాలుగా చెప్పుకోబడే పేదలకు సహితం కాంగ్రెస్ పార్టీ టికెట్‌లు రావడం కష్టమే.

### రాజగోపాల్‌రెడ్డిని మునుగోడు నుంచి తరిమేసినట్లే, చల్లమల్లను కూడా !

ఉపఎన్నికల తరువాత మునుగోడులో పోటీ చేసేందుకు అంత ఆసక్తి చూపని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రస్తుతం మరో రెండు నియోజక వర్గాలపై దృష్టిపెట్టినట్లు సమాచారం. గతంలో రాజగోపాల్‌రెడ్డిపై అనేక విశ్లేషణాత్మక, చైతన్యవంతమైన కథనాలను సమ సమాజం దిన పత్రికలో ప్రచురించడంతో కొంత మేరకు మునుగోడు నియోజకవర్గ ప్రజలు రాజగోపాల్‌రెడ్డి కుట్రలను, బీజేపీకి అమ్ముడు పోయిన విషయాలను కండ్లకు కట్టినట్లు వివరించాము. తద్వారా మునుగోడులో నూకలు చెల్లినట్లు అయ్యింది. అయితే ప్రస్తుతం మునుగోడు కాంగ్రెస్ తరపున టికెట్ నాకే వస్తుందని భావిస్తున్న చల్లమల్ల కృష్ణారెడ్డి కూడా అదే కోవకు చెందిన వ్యక్తి అనే అభిప్రాయం ఉండటం, అదే అంశాన్ని కార్య కర్తలు విశ్వసించడంతో చల్లమల్ల కూడా వేరే పార్టీ మారుతాడనే అలోచనతో ఉండటంతో పూర్తి స్థాయిలో క్యాడర్ విశ్వసించకపోవడం, కాంట్రాక్టర్లు కేవలం వ్యక్తిగత స్వార్థరాజకీయాలు చేస్తారనే అభిప్రాయం కార్యకర్తల్లో బలంగా ఉంది. అందుకే ఇటీవల పాదయాత్రలో కూడా పూర్తి స్థాయిలో కార్యకర్తల మద్ధతు లభించలేదు.

### ప్రజలకు సేవ చేయాలని సదుద్దేశం ఉంటే స్వచ్ఛంద సంస్థలు పెట్టాలే కానీ!

పాలిటీషియన్‌గా అవతారమెత్తి సావుకాడ పదివేలు, పెండ్లికాడ ఇరవై వేలు ఇచ్చి ఫోటోలకు ఫోజులిచ్చే ఘనులనే పాలిటీషియన్‌గా గుర్తించే ప్రజలు కాస్త తెలివికి రావాలే. నిజంగా ప్రజలకు సేవ చేయాలని తలిచే ఏ వ్యక్తి ఐనా పాలిటీషియన్‌గా అవతారం ఎత్తాల్సిన అవసరం లేదు. డబ్బు ఎక్కువగా ఉంటే స్వచ్ఛంద సంస్థలు పెట్టుకోని సేవ చేయవచ్చు. సేవ ముసుగులో అమాయక ప్రజల ఓట్లను దండుకొని ప్రజల జీవితాలతో ఆడుకోవడం పెట్టుబడిదారుల పని. పగటి వేషగాళ్లు తెల్లబట్టలు వేసుకొని పైసలు పంచితే సేవే కాదు...అదో పెద్ద నాటకం... ఓ బూటకం.

**జర్నలిస్టు పృధ్విరాజ్.జి (ఎడిటర్)**

## రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు బచ్చలకూర స్వామి అధ్యక్షతన

**రాజేంద్ర నగర్ ఆగస్టు 15,సమ సమాజం:** రాజేంద్రనగర్ మండల కన్వీనింగ్ కమిటీ మరియు భవన నిర్మాణ కార్మిక మండల కమిటీ ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బుద్వేల్, వట్టిపల్లి బి సి డబ్ల్యు యూనియన్ రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు బచ్చలకూర స్వామి అధ్యక్షతన 300 మంది నిర్మాణ రంగం కార్మికుల సమక్షం లో జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యమంలో ముఖ్య అతిథులుగా బి సి డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు రామ్ మోహన్ , అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ మేనేజర్ చరణ్ గారు, సి ఐ టి యురాజేంద్రనగర్ మండల కన్వీనర్ %ు%. రుద్రకుమార్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 4లేబర్ కోడ్ల విధానం ఉపసంహరించు కోవాలని, కార్మికులకు కనీస వేతనం 26000/ల రూపాయలు ఇవ్వాలని, దేశంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆస్తులు అమ్మడం మానుకోవాలి,ఆర్థిక వ్యవస్థలను కార్పొరేట్ సంవత్సలకు అప్ప చెప్పరాదు అని, ప్రజలందరికి విద్యా, వైద్యం, ఉచితంగా అందించాలని, భారత రాజ్యాంగని రక్షించు కుందాం బీజేపీ కా హటావో, దేశ్ కి భచ్చావో అని మాట్లాడారు.బుద్వేల్ మరియు వట్టిపల్లి అడ్డాల దగ్గర 300 మంది కార్మికులకు టీ షర్ట్, టోపీ లను పంచారు. ఈ కార్యక్రమం లో బి సి డబ్ల్యు యూనియన్ నాయకులు కప్పెట రాజు, చెంద్రశేఖర్, రాజ్ కుమార్, %ు%. మన్యం, రంగస్వామి, యాదయ్య,శ్రీపాల్, విజయ్ కుమార్, నాగేష్ బ్రహ్మయ్య, రహీమ్, చాంద్ పాష, దర్శన్ యాదగిరి,నర్సింగ్,మొదలగు కార్మికులు పాల్గొన్నారు.



## ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం... నల్లకుంట ఇన్స్పెక్టర్ జగదీశ్వర్ రావు

**హైదరాబాద్ ఆగస్టు 15/,సమ సమాజం:** మేము, మా పోలీస్ టీం మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, భవిష్యత్తులో మరిన్ని సమస్యల పరిష్కారానికి మీ అసోసియేషన్ సహకారం అందించాలని నల్లకుంట ఇన్స్పెక్టర్ జగదీశ్వర్ రావు అన్నారు. నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా నల్లకుంట ఇన్స్పెక్టర్ హాజరై జెండాను ఎగరవేశారు. సీనియర్ గజిటెడ్ ఆఫీసర్ రిటైర్డ్ శంకరం మాట్లాడుతూ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన వీరుల త్యాగాలను గుర్తు చేసుకోవాలని, వారి ఆశయాల కోసం అందరం కృషి చేయాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా కలిసి పోరాటం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సిఐ కి, ఎస్ఐ కి మరియు పెద్దలకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్సీఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సీనియర్ నాయకులు రమేష్ నాయుడు , ఎన్సీఏ ప్రధాన కార్యదర్శి మోహన్ నాయుడు , బాలకృష్ణారెడ్డి , శ్రీనాథ్, డాక్టర్ అమర్నాథ్, ఎస్ఐ శివశంకర్, రామకృష్ణారావు, అశ్విన్, శ్రీనివాసరావు, వేణుగోపాల్, రితేష్, రమణ, కిరణ్, సురేష్, రాజేష్, దీక్షితులు, ప్రశాంత్, మధు, గోపాల్, రఘు, శివకుమార్, లక్ష్మణ్, గోవర్ధన్, జితేందర్ రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



# ఆశీర్వదించండి!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సంక్షుభిత జీవన చిత్రాన్ని తలుచుకుంటే ఇప్పటికీ దుఖం తన్నుకొస్తుంది. ఎడతెగని కరెంటు కోతలు, అర్ధరాత్రి మోటరు పెట్టబోయి కరెంటు షాకుకో, పాము కాటుకో బలైపోయిన రైతన్నలు. అప్పుల ఊబిలో చిక్కి ఆత్మహత్యలే శరణ్యమైన అన్నదాతలు. ఉరి పెట్టుకుంటున్న చేనేత కార్మికులు. యువకులంతా వలసెల్లిపోతే ముసలివాళ్లే మిగిలిన పల్లెలు. ఎటుచూసినా ఆకలిచావులు, హాహాకారాలు. ఇలాంటి అగమ్యగోచర పరిస్థితుల నడుమ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ పునర్నిర్మాణాన్ని ఒక పవిత్ర యజ్ఞంగా నిర్వహించింది. అనేక రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టింది.

**నేడు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి**

ఒక దేశం, రాష్ట్రం సాధించిన ప్రగతికి తలసరి ఆదాయం, తలసరి విద్యుత్ వినియోగాన్ని సూచికలుగా పరిగణిస్తారు. ఈ రెండింటిలోనూ తెలంగాణ దేశంలో నంబర్ 1గా నిలిచింది. రూ.3,12,398 తలసరి ఆదాయంతో, 2,126 యూనిట్ల తలసరి విద్యుత్తు వినియోగంతో తొలి స్థానంలో ఉంది. రైతు సంక్షేమంలో తెలంగాణకు సాటి రాగల రాష్ట్రం దేశంలో మరొకటి లేదు. తొమ్మిదిన్నరేళ్లలో రూ.37 వేల కోట్ల పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. 24 గంటల ఉచిత విద్యుత్తు, సకాలంలో ఎరువులు, విత్తనాల సరఫరా, రైతు బంధు, రైతు బీమా, పంట రుణాల మాఫీ తదితర సంక్షేమ చర్యలతో వ్యవసాయ రంగాన్ని అద్భుతంగా స్థిరీకరించింది. కొంతమంది అల్పబుద్ధిని ప్రదర్శిస్తూ వక్ర భాష్యాలు చెబుతున్నారు. వ్యవసాయానికి 3 గంటల విద్యుత్తు చాలని వ్యాఖ్యానిస్తున్నారు. వీరికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని విశ్వసిస్తున్నా. మిషన్ కాకతీయ, పెండింగు ప్రాజెక్టుల నిర్మాణం, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులతో తెలంగాణ ప్రభుత్వం సాగునీటి రంగంలో స్వర్ణయుగాన్ని సృష్టించింది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకునేందుకు విపక్షాలు ప్రయత్నించినా కేసులు వీగిపోయాయి. పర్యావరణ అనుమతులు లభించాయి. స్వల్ప కాలంలోనే 21 వైద్య కళాశాలలను ప్రారంభించి రాష్ట్రం చరిత్ర సృష్టించింది. మరో 8 మెడికల్ కాలేజీలను త్వరలోనే ప్రారంభించి, ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. హైదరాబాద్ చుట్టూ 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, నిమ్స్ విస్తరణ శరవేగంగా జరుగుతున్నాయి. అనాథ పిల్లలను 'స్టేట్ చిల్డ్రన్'గా గుర్తిస్తూ వారికోసం ప్రత్యేక పాలసీని ప్రభుత్వం రూపొందించింది. వెయ్యికి పైగా గురుకుల జూనియర్ కళాశాలలు ప్రారంభించాం. మన ఊరు మన బడి, మన బస్తీ మన బడి పేరుతో రాష్ట్రంలోని 26 వేలకు పైగా పాఠశాలలను సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నాం. రూ.20 లక్షల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నాం. టీఎస్ ఐపాస్ చట్టం, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో పారిశ్రామిక రంగంలో నూతనోత్తేజం వచ్చింది. రూ.2.51 లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చాయి. 17.21 లక్షల మందికి ఉపాధి లభించింది. రాష్ట్రంలో 6 లక్షలకు పైగా ఐటీ ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. ఐటీ ఎగుమతులు రూ.57,258 కోట్ల నుంచి రూ.2,41,275 కోట్లకు పెరిగాయి.

**త్వరలో 'తెలంగాణ చేనేత మగ్గం'**

దళితబంధు కింద దళిత కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం. ప్రభుత్వ లైసెన్సు వ్యాపారాల్లో దళితులకు 15 శాతం రిజర్వేషన్లు, బీసీల్లోని వృత్తిపనుల వారికి, మైనారిటీలకు రూ.లక్ష సాయం, ధూపదీప నైవేద్యం పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంపు, గొర్రెల పంపిణీ, చేపల పెంపకం, ఈత, తాటి చెట్లపై పన్ను రద్దు, మద్యం దుకాణాల్లో గౌడలకు 15శాతం రిజర్వేషన్లు, గీతన్న, నేతన్నలకు రూ.5 లక్షల బీమా, నేత కార్మికులకు నూలు రసాయనాలపై 50 శాతం సబ్సిడీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఫ్రేమ్ మగ్గాల పంపిణీకి 'తెలంగాణ చేనేత మగ్గం'అనే కొత్త పథకాన్ని అమలు చేయనున్నాం. ఆసరా పెన్షన్లను రూ.200 నుంచి రూ.2,016కు, లబ్దిదారుల సంఖ్యను 29 లక్షల నుంచి 44 లక్షలకు పెంచాం. లబ్దిదారుల వయో పరిమితిని 60 నుంచి 57 ఏళ్లకు తగ్గించాం. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచాం. 33,373 మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయం తీసుకోగా, ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఆందోళన చెందిన సంకుచిత శక్తులు ఆర్టీసీ బిల్లును అడ్డుకోవడానికి విఫల ప్రయత్నాలు చేశాయి. వారి ప్రయత్నాలను వమ్ముచేస్తూ అసెంబ్లీలో ఆర్టీసీ బిల్లు విజయవంతంగా ఆమోదం పొందింది. తెలంగాణ ఉద్యోగులు దేశంలోనే అత్యధిక వేతనాలను పొందుతున్నారు. త్వరలోనే కొత్తగా పీఆర్సీ నియమించి, ఉద్యోగుల వేతనాలను పెంచుతాం. అప్పటివరకూ మధ్యంతర భృతిని చెల్లిస్తాం. సింగరేణి కార్మికులకు వచ్చే దసరా, దీపావళి పండుగల బోనస్‌గా రూ.1,000 కోట్లు పంపిణీ చేయబోతున్నాం. వీఆర్ఏలు, పంచాయతీ కార్యదర్శులనూ క్రమబద్ధీకరించాలని నిర్ణయించాం. తెలంగాణ దశాబ్ది వేడుకల వేళ లక్షా 50 వేల మంది ఆదివాసీ, గిరిజనులకు 4 లక్షల ఎకరాలకు పైగా పోడు భూములపై ప్రభుత్వం యాజమాన్య హక్కులు కల్పించింది. వారికి రైతుబంధు సాయం సైతం అందించింది. పోడు కేసుల నుంచి విముక్తులను చేసింది. గృహలక్ష్మి పథకం కింద ప్రతి నియోజకవర్గంలో 3 వేల మందికి లబ్ధి చేకూరనుంది. ఈ పథకంలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాం. గత నెలలో భారీ వర్షాలు కురవడంతో తక్షణ సహాయంగా రూ.500 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు మంగళవారం నుంచే అర్హులైన పేదలకు అందజేస్తున్నాం. నగరం నలువైపులకూ రూ.69 వేల కోట్లతో మెట్రో రైలును విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంపద పెంచు ప్రజలకు పంచు అనే సదాశయంతో అనుసరిస్తున్న విధానాల ఫలితంగా రాష్ట్రంలో పేదరికం తగ్గుతోందని, తలసరి ఆదాయం పెరుగుతోందని నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన బహుముఖీయ పేదరిక సూచి స్పష్టం చేసింది. జాతీయ స్థాయి సగటుతో పోల్చిచూస్తే తెలంగాణలో పేదరికం అందులో మూడోవంతుగా నమోదైంది.

# సాంప్రదాయాన్ని బ్రేక్ చేసిన ఖర్గే....

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షునిగా మొదటిసారి కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. అయితే.. ఏ కాంగ్రెస్ అధ్యక్షుడు చేయని విధంగా, పార్టీ సాంప్రదాయానికి విరుద్ధంగా ప్రవర్తించారు ఖర్గే. సోనియా గాంధీ హయాంలో ఇలా జరగలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇంతకూ ఎం చేశారు..? స్వాతంత్ర్య వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే హాజరవలేదు. తనకు కంటి సమస్య కారణంగా రావడం కుదరదని చెప్పారు. సెక్యూరిటీ సమస్యల వల్ల ఒక్కసారి ఎంట్రీ ఇస్తే.. ప్రధాని, రక్షణ మంత్రి, స్పీకర్‌లు వెళ్లేవరకు ఎవరినీ బయటకు వెళ్లనివ్వరు.. తాను ఇంటివద్ద, కాంగ్రెస్ అధికారిక భవనంలో జెండా ఎగురవేయాల్సిన ఉన్నందున రాలేకపోతున్నానని చెప్పారు.

**సాంప్రదాయానికి విరుద్ధంగా..:**

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకునే క్షణాన రాజకీయాలకు వెళ్లకూడదనే నియమం పార్టీలో ఉండేది. అందుకు అనుగుణంగానే ఇప్పటివరకు ఉన్న అధ్యక్షులు పాటించారు. కానీ నేడు మల్లిఖార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రస్తుత ప్రభుత్వం తన హయాంలోనే భారత్ అభివృద్ధి చెందినట్లు చెప్పడంపై విమర్శలు కురిపించారు. కేవలం గతంలో ఏర్పాటు చేసిన పథకాలనే రూపుమార్చి కొత్త పేరుతో ముందుకు తెస్తున్నారని ఆరోపించారు. చివరికి ప్రధాని వాజ్‌పేయి సమయంలో కూడా ఇలాంటి పరిస్థితులు లేవని ఖర్గే అన్నారు. అలాగే.. స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన త్యాగమూర్తులను ఖర్గే కొనియాడారు. గాంధీజీ, నెహ్రూ, పటేల్, నేతాజీ, అంబేద్కర్‌లను తలుచుకున్నారు. దేశ భవితవ్యాన్ని నిర్మించడంలో గత ప్రధానులు చేసిన పనిని గుర్తు చేశారు. అటు.. స్వాతంత్ర్య ఉపన్యాసంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా దేశంలో ప్రతిపక్ష పార్టీలపై మండిపడ్డారు. అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. ఈ మూడు భూతాలను దేశం నుంచి పారదోలాలని అన్నారు. గత 75 ఏళ్ల నుంచి దేశంలో కొన్ని సమస్యలు వెంటాడాయని చెప్పారు. రాజరిక పాలన, ఇంకా ఓ పార్టీ కుటుంబానికి, కుటుంబం చేత, కుటుంబం కోసం అనే మూలసూత్రాల మీద పనిచేసిందని కాంగ్రెస్ పేరు ఎత్తకుండానే నిప్పులు చెరిగారు.

# ట్రంప్‌పై మరో తీవ్రమైన అభియోగం

(మొదటి పేజీ తరువాయి)

18 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. ఎన్నికల ఫలితాలు ట్రంప్‌కు అనుకూలంగా వచ్చేలా చేసేందుకు తోటి వ్యక్తులు కుట్ర పన్నారని జ్యూరీ పేర్కొంది. ఆగస్ట్ 25వ తేదీలోపు ఈ 19 మంది స్వచ్ఛందంగా సరెండర్ కావాలని ఫుల్టన్ కౌంటీ జిల్లా మహిళా అటార్నీ ఫ్యానీ విల్లీస్ సోమవారం ఆదేశించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ట్రంప్ మాజీ న్యాయవాది రూడీ గిలియానీ, శ్వేతసౌధం మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మార్క్ మిడోస్, అధ్యక్షభవనం మాజీ న్యాయవాది జాన్ ఈస్ట్‌మన్, న్యాయశాఖ మాజీ ఉన్నతాధికారి జెఫ్రీ క్లార్క్ ఉన్నారు. 'ఇదంతా రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న ఆరోపణ' అని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అభియోగాలను అధికార డెమొక్రటిక్ పార్టీ నేతలు సమర్థించారు. 'ఎన్నికల ప్రక్రియను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ట్రంప్ పన్నిన కుట్రను ఈ అభియోగాలు బట్టబయలుచేస్తున్నాయి' అని సెనేట్ మెజారిటీ లీడర్ షూమర్, హౌజ్ మైనారిటీ లీడర్ హకీమ్ అన్నారు.

# కచ్చితత్వం.. పారదర్శకం

అమరావతి: రిజిస్ట్రేషన్ సేవల్లో కచ్చితత్వం, పారదర్శకతను రూపొందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా రిజిస్ట్రేషన్ల సేవలను ఆన్‌లైన్ ద్వారా అందియిచాలని యోచిస్తోంది. ఇప్పటికే కొన్ని సేములు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రాగా త్వరలో మరికొన్ని కీలక సేవలను ఆన్‌లైన్ చేయనుంది. గతంలో వివాహాల రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లోనే వివాహ రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకునే అముకాశాన్ని కల్పించింది. అవసరమైన పత్రాులను అప్‌లోడ్ చేస్తే నిర్దేశిత సమయంలో సర్టిఘికెట్లను ప్రభుత్వం జారీ చేస్తోంది. హిందూ, ఇతర మతాల వివాహాలను ప్రత్యేకంగా రిజిస్టర్ చేసేందుకు వెసులుబాటు కల్పించింది. హిందూ వివాహాల రిజిస్ట్రేషన్ కోసం ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి ఫాం%--%ఏ పూర్తి చేసి దానితో పాటుగా వెడ్డింగ్ కార్డు, వివాహ ఫొటో, ఇంటి అడ్రస్ ప్రూఫ్, దంపతుల ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత సాక్షులతో కలిసి రిజిస్టర్ ఆఫీసుకు వెళ్లి సంతకాలు పెడితే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. స్పెషల్ వివాహాల చట్టం కింద ఇతర సాంప్రదాయాల్లో జరిగే వివాహాలను ఆన్‌లైన్‌లోనే రిజిస్టర్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

# వారసులు రెడీ

హైదరాబాద్: ఏడాది చివర్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి తరఫున పోటీ చేసే అభ్యర్థుల జాబితాపై పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. వరుసగా మూడోసారి రాష్ట్రంలో అధికారం చేపట్టే దిశగా వ్యూహరచన చేస్తున్న సీఎం.. పార్టీ అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఎక్కువ సాగదీయకుండా వీలైనంత త్వరగా అభ్యర్థుల జాబితాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి తమ వారసులకు అవకాశం ఇవ్వాలంటూ సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్న పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొందరు అధినేతకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. అవకాశం చిక్కితే తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని, అసెంబ్లీ ఎన్నికల ద్వారా అరంగేట్రం చేయాలని సుమారు 30 మంది నేతల వారసులు ఉత్సాహం చూపుతున్నట్లు సమాచారం. కాగా ఎమ్మెల్యేల వినతులను పరిశీలిస్తున్న కేసీఆర్..కొందరి వినతిని పరిగణనలోకి తీసుకోవడంపై తర్జనభర్జన పడుతున్నట్టు తెలిసింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పెద్దపీట వేస్తూ గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి భావిస్తున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

**లోక్‌సభకు తలసాని..!**

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మరో మూడు నెలల్లోనే లోక్‌సభ ఎన్నికలు తెరమీదకు రానున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికలకు అనుసరించే వ్యూహం ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికపై కొంత మేర ప్రభావం చూపే అవకాశం కన్పిస్తోంది. కొందరు వారసులకు అసెంబ్లీ టికెట్లు దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు సాయికిరణ్ సికింద్రాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి గట్టి పోటీనిచ్చేందుకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను లోక్‌సభ అభ్యర్థిగా పంపే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. ఆయన స్థానంలో సాయికిరణ్ సనత్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బరిలోకి దిగే అవకాశముంది. ఇదే తరహాలో గతంలో మల్కాజిగిరి ఎంపీగా పనిచేసిన మంత్రి మల్లారెడ్డిని మరోమారు లోక్‌సభకు పోటీ చేయించాలని సీఎం భావిస్తున్నారు. 2019లో మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసిన ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి మేడ్చల్ సీటు కేటాయిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**జోరుగా పర్యటనలు**

పలువురు ఎమ్మెల్యేల కుమారులు, ఇతర కుటుంబసభ్యులు ఇప్పటికే క్రియాశీల రాజకీయాల్లో ఉంటూ వేర్వేరు పదవుల్లో కొనసాగుతున్నారు. ఆర్మూర్, నిర్మల్, పటాన్‌చెరు, తాండూరు, నిజామాబాద్ అర్బన్, చేవెళ్ల, షాద్‌నగర్ ఎమ్మెల్యేల కుటుంబసభ్యులు నియోజకవర్గ స్థాయిలో కీలకంగా పనిచేస్తున్నారు. అవకాశం చిక్కితే అసెంబ్లీ ఎన్నికల బరిలోకి అడుగు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కుమారుడు రోహిత్ రావు మెదక్ టికెట్‌ను ఆశిస్తూ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రోహిత్‌కు కూడా టికెట్ ఇవ్వాలని మైనంపల్లి కోరుతున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్‌రావు, మంత్రి సబితా ఇంద్రారెడ్డి (మహేశ్వరం) కుమారుడు కార్తీక్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా పరిధిలో ముఠా గోపాల్ (ముషీరాబాద్) కుమారుడు ముఠా జయసింహ కూడా అసెంబ్లీపై కన్నేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎమ్మెల్యే జోగు రామన్న కుమారుడు జోగు ప్రేమేందర్ మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

# మళ్లీ నేనే!

(మొదటి పేజీ తరువాయి)

హయాంలో సాధించిన విజయాల గురించి.. గత ప్రభుత్వాల వైఫల్యాల గురించి ప్రస్తావించారు. అవినీతి, వారసత్వ పాలన, బుజ్జగింపు రాజకీయాలంటూ.. ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2014లో ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని.. సంస్కరణలు, పనితీరు, పరివర్తన ద్వారా నెరవేర్చానని.. అందువల్లే 2019లో మళ్లీ తనను ఆశీర్వదించారని పేర్కొన్నారు. దేశం అవినీతి సంకెళ్లలో కూరుకుపోయి.. లక్షలకోట్ల రూపాయల కుంభకోణాలు ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్న సమయంలో.. పాలన బలహీనంగా మారిన తరుణంలో తాము లీకేజీలను ఆపి బలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించామని మోదీ చెప్పుకొన్నారు. పదేళ్ల క్రితం కేంద్రం నుంచి రాష్ట్రాలకు రూ.30 లక్షల కోట్లు వెళ్లేవని, అది ఈ తొమ్మిదేళ్లలో రూ.100 లక్షల కోట్లకు చేరుకున్నదని చెప్పారు. పేదల ఇళ్ల నిర్మాణానికి నాలుగు రెట్లు ఎక్కువగా రూ.4 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. తన మొదటి ఐదేళ్ల పాలనలోనే 13.5 కోట్లమంది ప్రజలు పేదరిక సంకెళ్లను తెంచుకుని మధ్యతరగతిలోకి ప్రవేశించారని తెలిపారు. చేతివృత్తులు, హస్తకళలను ఆశ్రయించిన ఓబీసీల కోసం విశ్వకర్మ జయంతి రోజున 'విశ్వకర్మ యోజన'ను ప్రకటిస్తామన్నారు. ఆ పథకం కింద వారికి రూ.13 నుంచి 15 వేల కోట్లు ఇస్తామని తెలిపారు. అలాగే.. నగరాల్లో అద్దె ఇళ్లలో నివసించే మధ్యతరగతి ప్రజల, మురికివాడల్లో నివసించే పేదల సొంతింటి కల సాకారానికి త్వరలో కొత్త పథకం తెస్తామన్నారు. వారు ఇల్లు నిర్మించుకోవాలనుకుంటే తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. ఆదాయపన్నును రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచడం వల్ల వేతన, మధ్యతరగతి జీవులకు ఎంతగానో ప్రయోజనం చేకూరిందన్నారు. అలాగే.. 'లఖ్‌పతి దీదీ' పథకం కింద దేశంలో రెండు కోట్ల మంది మహిళలకు ప్లంబింగ్, ఎల్ఈడీ బల్బుల తయారీ వంటివాటిలో నైపుణ్య శిక్షణ ఇప్పించి వారిని లక్షాధికారులను (ఏడాదికి రూ.లక్ష ఆదాయం వచ్చేలా) చేస్తామని.. రెండు కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేయడం తన కల అని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ.70 వేల కోట్లు.. కరోనా వ్యాక్సిన్‌పై రూ.40 వేల కోట్లు ఖర్చుచేసినట్టు తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా 5జీ సేవలను ప్రజలకు అందించింది భారతదేశమేనని.. ఇప్పటికే 700 జిల్లాల్లో 5జీ సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఇప్పుడు 6జీ సేవలను అందించడానికి కూడా సిద్ధమవుతున్నామని ప్రధాని తెలిపారు. ఇలా గత తొమ్మిదేళ్ల పాలనలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ఏకరువు పెట్టిన మోదీ.. ద్రవ్యోల్బణాన్ని మాత్రం అంతగా తగ్గించలేకపోయామని అంగీకరించారు. అలాగే.. మణిపూర్‌లో సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని, శాంతి నెలకొంటోందని చెప్పారు. 2014, 2019లో బలమైన ప్రభుత్వం ఏర్పాటు చేసినందువల్లే సంస్కరణలు తీసుకువచ్చే ధైర్యం తనకు వచ్చిందన్న మోదీ.. తన ప్రసంగంలో ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత 75 ఏళ్లలో కొన్ని చెడు శక్తులు సమాజంలో చొచ్చుకుపోయినందువల్లే అభివృద్ధికి అడ్డంకులు ఏర్పడుతున్నాయన్నారు.

# అగ్ర పథానికి 5 వ్యూహాలు!

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి/విశాఖపట్నం: భారతదేశం ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం లక్ష్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఒక విజన్ డాక్యుమెంటును విడుదల చేశారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం రోజు విశాఖ నగరంలోని ఎంజీఎం పార్కు గ్రౌండ్‌లో ప్రజల సమక్షంలో ఆవిష్కరించి.. అందులోని ముఖ్యాంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. 2047వ సంవత్సరం నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అవుతుంది. ఏ వ్యూహాలు అనుసరిస్తే అప్పటికి దేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుందో వివరిస్తూ మొత్తం 52 పేజీలతో ఈ డాక్యుమెంటును రూపొందించారు. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన తొలిసారి విజన్-2020 తయారు చేయించి విడుదల చేశారు. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్ర కోసం విజన్-2029 తయారు చేయించారు. ఆ అనుభవంతో ఇప్పుడు దేశం కోసం 'భారత్-భారతీయులు-తెలుగువారు-విజన్-2047'ని రూపొందిం పజేశారు. ఐదు ప్రధాన వ్యూహాలతో ముందుకెళ్తే మన దేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుందని చంద్రబాబు ఇందులో తెలిపారు. ప్రపంచానికి నాయకత్వం వహించే శక్తిని సంపాదించుకోవడానికి నిర్దిష్టంగా కొన్ని లక్ష్యాలు పెట్టుకుని పనిచేయాలని, అప్పుడే మన దేశం 2047 నాటికి ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఈ విజన్ డాక్యుమెంటు ముందుమాటలో పేర్కొన్నారు. 'భారతదేశం బాగుండాలి. అందులో తెలుగువారు అగ్రజాతిగా ఉండాలి. ప్రపంచానికి మనమే సేవలు అందించాలి. ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలవాలి. పేదరికం లేకుండా ఆర్థిక అసమానతలు పోవాలి. అదే నా లక్ష్యం. దాని కోసమే విజన్-2047 రూపొందించాను' అని ఆయన ప్రజెంటేషన్ సందర్భంగా తెలిపారు. దేశం వందేళ్ల స్వాతంత్ర్య దినోత్సవం చేసుకునేనాటికి ఎలా ఉండాలని తాను ఆకాంక్షిస్తున్నానో వెల్లడించారు. చైనాను కూడా అధిగమించి ముందుకువెళ్లే శక్తి మన దేశానికి ఉందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అవినీతిని, నేరాలను నియంత్రిస్తే సంక్షేమం, అభివృద్ధి వాటంతట అవే పోటీ పడతాయని తెలిపారు. దీనిపై మేధావులతో అనేక సమావేశాలు నిర్వహించి, అందరి సలహాలు తీసుకుని 'విజన్-2047'ని ఇంకా మెరుగ్గా తయారుచేస్తానన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం ఇవ్వాలని, అన్ని కులాల అభివృద్ధికి అవకాశాలు కల్పించాలని చెప్పారు. యువత దేశ సంపద అని, వారి సంఖ్య దేశంలో అధికంగా ఉందని.. రాబోయే వందేళ్లు ప్రపంచాన్ని భారతే ఏలుతుందన్నారు. దేశంలో 1991లో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయని, అనంతరం ఇంటర్‌నెట్ విప్లవం వచ్చిందని, దానికి జనాభాలో అత్యధికంగా ఉన్న యువత తోడయ్యారని, ఎకానమీ పెరిగిందని, దాంతో ఊహించని ప్రగతి సాధ్యమైందని చంద్రబాబు విశ్లేషించారు. భారతదేశం స్లీపింగ్ జెయింట్ అనుకున్న ప్రపంచం.. ఈ పరిణామాలతో ఇటు వైపే చూడడం ప్రారంభించిందన్నారు. 'నేను 1995లో ముఖ్యమంత్రినయ్యాను. అప్పటికే పీవీ నరసింహారావు అమలు చేసిన ఆర్థిక సంస్కరణలను రెండో జనరేషన్‌గా పట్టాలపైకి ఎక్కించాను. విద్యుత్ సంస్కరణలతో 2004 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా చేశాం. జేగురుపాడులో గ్రీన్‌ఫీల్డ్ పవర్ ప్రాజెక్టు, హైదరాబాద్‌లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, ఓపెన్ స్కై విధానం ద్వారా ఎమిరేట్స్ నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు తెప్పించాం.

# స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో దేశ అభివృద్ధికి అందరూ పాటుపడాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు

**జగిత్యాల సమ సమాజం::** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్రదినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకావిష్కరణ గావించారు.అనంతరం పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల సుదీర్ఘ పోరాటం మూలంగానే దేశానికి స్వాతంత్రం సాధించుకొని నేడు స్వేచ్ఛగా జీవిస్తున్నామని స్వాతంత్ర దినోత్సవం రోజు వారి సేవలను గుర్తు చేసుకోవడం అందరి బాధ్యత అన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తితో జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేసి జిల్లాలోని ప్రజల అభివృద్ధికి తోడ్పడేలా ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలని అన్నారు. దేశం అన్ని రంగాలలో ప్రథమ స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ బిఎస్ లత, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు టీఎస్ దివాకర కలెక్టర్ కార్యాలయ ఏవో ఎం హనుమంతరావు, జిల్లా అధికారులు ముఖ్య ప్రణాళిక అధికారి పూర్ణచంద్రరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## జగిత్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు..

**జగిత్యాల టౌన్/ సమ సమాజం:** జగిత్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మంగళవారం పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలను పురస్కరించుకొని ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ కే రాజేందర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగాల ఫలితమే ఈ స్వేచ్ఛ స్వాతంత్రాన్ని ఆయన పేర్కొన్నారు. ఆఫీస్ స్టాఫ్ జి శ్రీధర్, వెంకటేష్ , అభిలాష్ , అనిల్, సందీప్, స్టాంప్ వెండర్లు ఉమేష్ , డాక్యుమెంట్ రైటర్లు కె.వి మోహన్ రావు, రాజారాం, రవి, ప్రవీణ్, వినీల్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయం లో ఘణంగా 77వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు

**దేశ సేవకు పునరంకితం కావాలి: జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్**

**జగిత్యాల టౌన్/సమ సమాజం:** జిల్లా పోలీస్ కార్యాలయం లో ఈరోజు 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ స్వాతంత్ర సమరయోధులను స్మరించుకుంటూ జాతీయ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది, ప్రజలందరికీ, అధికారులకు, సిబ్బందికి ముందుగా 77వ స్వాతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ ఒక్కరూ దేశసేవకు పునరంకితం కావాలన్నారు. స్వాతంత్ర పోరాటాన్ని గుర్తు చేసుకోవడం, భారతదేశానికి స్వేచ్ఛ కల్పించిన త్యాగధనులను స్మరించుకోడం మనందరి బాధ్యత అన్నారు. పోలీసు అధికారులు జాతి సమగ్రత, సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలన్నారు. ఎందరో మహానుభావులు త్యాగఫలమే ఈరోజు మనందరం స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవిస్తున్నామని తెలిపారు. మహానుభావుల త్యాగాలను నిరంతరం స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు ఎస్పీ ప్రభాకర్ రావు,డిఎస్పి లు వెంకటస్వామి, రవీంద్ర రెడ్డి , రవీంద్ర కుమార్, రఘు చందర్, ఏవో అమర్నాథ్, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ,రిజర్వు ఇన్స్పెక్టర్లు , రామకృష్ణ, జానీ మియా, వేణు,మరియు రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్ లు, డీపీఓ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ



**ఎల్బీనగర్ ఆగస్టు 15/సమ సమాజం:** శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం . ..భగత్ సింగ్ నగర్. .సరూర్నగర్ డివిజన్ ...15వ ఆగస్టు జండా ఆవిష్కరణ.. సంఘం ఆధ్వర్యంలో చేయడం జరిగింది..జండ ఆవిష్కరణ సంఘం అధ్యక్షులు కుంట్ల ఆంజనేయులు ..జెండా ఆవిష్కరించారు ...ముఖ్యఅతిథిగా వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగా చారి . మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్న కానీ దేశంలో రాష్ట్రంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని పేదలకు ఎక్కడ న్యాయం జరగటం లేదని అన్నారు .రాష్ట్రంలో బీసీ పథకాలు పేరుతో ప్రజలను మోసగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షులు కుంట్ల .ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం పథకాల పేరుతో ప్రజలను మోసగిస్తుందని బీసీలకు లక్ష రూపాయలు పథకాల ప్రవేశపెట్టి ఊర్లో కనీసం 20 మంది బీసీలు ఉంటే ఒక్కరికి ఇచ్చి అందరికీ ఇచ్చినట్టుగా చూయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు..... జక్క నాగయ్య..... ఎషాల మల్లేష్ .....ఎల్లయ్య..... సాదుల గోపాల్. ....విశ్వనాథం.... గోపాల్... .పుండరీకం .....చిన్న బేటయ్య..... భాషయ్య..... శంకరయ్య..... తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ నగర్ బస్తీలలోజెండా ఆవిష్కరణలో పాల్గొన్న సిపిఐ అజీజ్ పాషా.

**ఎల్బీనగర్ ఆగస్టు సమ సమాజం:** 77వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సరూర్నగర్ మండల పరిధిలో భగత్ సింగ్ నగర్ ఫేస్ 1. భగత్ సింగ్ నగర్ శంకర్ నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 15 జండా ఆవిష్కరణలు చేయడం జరిగింది జెండా ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా సిపిఐ మాజీ ఎంపీ అజీజ్ పాషా జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అజిత్ భాష మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాల అవుతున్న ప్రజలకు ఏ సదుపాయాలు అందడం లేదని అన్నారు రాష్ట్రంలో కేంద్రంలో అధికారం లో ఉన్న ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. మణిపూర్ లో జరుగుతున్న అరాచకాలను కేంద్రప్రభుత్వం పట్టించు కోవడం లేదు అని మహిళలను అరాచకాలకు చిత్రహింసల గురి చేస్తున్నారని మండిపడ్డారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్ సరూర్నగర్ మండల కార్యదర్శి చందు. .....భగత్ సింగ్ నగర్ ఫేస్ వన్ శాఖ కార్యదర్శి మహమూద్.... భగత్ సింగ్ నగర్. శంకర్ నగర్ శాఖ కార్యదర్శి జల్లాల కృష్ణ...... ప్రసాదు.... జాహీద్..... వసంత... నర్సమ్మ ...పుల్లమ్మ... బాలరాజ్ గౌడ్ ..నగేష్ గౌడ్ ....కిషోర్.... శేఖర్.... ఇందిరీస్. ...జోసఫ్.... కిషన్.... భాస్కర్ .....శీను .....మురళి కృష్ణ .....మహిళా మండలి ప్రెసిడెంట్ శ్యామల.... ఖాదర్ బి... భాగ్య ...రమణమ్మ.... సాలమ్మ.... తదితరులు పాల్గొన్నారు.





## వాసవి పర్వస్ సంఘం ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**ఆలేరు ఆగస్టు 15 సమ సమాజం:** ఆలేరు మండలం ఆలేరు పట్టణ కేంద్రంలో నీ 77 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు వాసవి పర్వస్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినారు.వాసవి పర్వస్ సంఘం అధ్యక్షులు సముద్రాల శ్రీనివాస్ గుప్తా జెండా ఆవిష్కరించారు అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జవహర్లాల్ నెహ్రూ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎందరో మహనీయుల వల్ల స్వాతంత్రం వచ్చిందని ఆయన అన్నారు. దేశ ప్రజల భద్రత కోసం 30 సంవత్సరాలు ఆర్మీలో సేవలందించిన ఆలేర్ పట్టణ వాస్తవ్యులు ముదిగొండ సాయిశంకర్ గారిని స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆలేరు వాసవి పర్వస్ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు ఉత్తమ ఐడియా అవార్డు గ్రహీత సముద్రాల శ్రీనివాస్ గుప్తా . సారాబు సంతోష్ కుమార్ గుప్తా ప్రధాన కార్యదర్శి ముదిగొండ సాయి శంకర్ ను సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో పవర్ శ్రీనివాస్ తోట ప్రశాంత్ గుప్తా బెల్ద సంతోష్ కుమార్ గుప్తా సముద్రాల వేణుగుప్త బెల్దా శ్రీధర్ గుప్తా నాగబండి నాగేందర్ గుప్తా జిల్లాలు పురం శ్రీనివాస్ గుప్తా బచ్చ మణికంఠ గుప్తా పాల్గొన్నారు.

## శ్రీశైలం పద్మశాలి అన్నదాన సత్రంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**శ్రీశైలం ఆగస్టు 15/సమ సమాజం:** శ్రీశైలం క్షేత్రంలోని అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలీయుల నిత్యాన్నదాన సత్రం ఆవరణలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపారు. జాతీయ జెండాను సత్రం అధ్యక్షులు వర్కాల సూర్యనారాయణ ఎగురవేశారు. ఈ సందర్భంగా భక్తులకు, సత్రం సిబ్బందికి మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం అధ్యక్షులు వర్కాల సూర్యనారాయణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయులు చూపిన మార్గంలో యువత పయనించి దేశానికి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. పద్మశాలి నిత్యాన్నదాన సత్రంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్రం కార్యనిర్వాహక అధ్యక్షులు కర్నాటి శ్రీధర్, ఉపాధ్యక్షులు గోశిక యాదగిరి, గంజి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శులు జీరపు చంద్రశేఖర్, పున్న శ్రీనివాస్, కోశాధికారి రావిరాల వీరయ్య, కార్యదర్శులు ఏలె యాదయ్య, రుద్ర మహాలక్ష్మి, కార్యాలయ కార్యదర్శి తుమ్మ సత్యనారాయణ, సభ్యులు చిలువేరు చంద్రయ్య, ఏలె లక్ష్మీనారాయణ, యర్రమాద రాములు, బొమ్మ రాములు, వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అరుణ్ అమృతవార్, మేఘ సునీల్ చింతల్, నాగార్జున చిలివేరి, అధిక సంఖ్యలో వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 77 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో







**ఆలేరు ఆగస్టు 15సమ సమాజం:** ఆలేరు నియోజకవర్గంలో రాజపేట మండలం పట్టణ కేంద్రంలో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద 77 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా జాతీయ జెండా ఎగరవేసి నా రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిలె. మహేందర్ గౌడ్ మాట్లాడుతూ 77 సంవత్సరాలు స్వాతంత్ర దినోత్సవం ముగించుకొని జండా ఆవిష్కరణ జరిగిందని మహాత్మా గాంధీ గారు సర్దార్ వల్లభాయ్ పటేల్ జవహర్ లాల్ నెహ్రూ ఎందరో మహానుభావులు మహనీయులు స్వాతంత్రం వచ్చిందని ప్రతి సంవత్సరం స్వాతంత్ర దినోత్సవం పండుగ జరుపుకోవాలని ప్రజలందరూ పాల్గొనాలని ఆయన అన్నారు అభివృద్ధి పథకంలో గ్రామాలు పట్టణాలు నగరాలు నగరపాలక పురపాలక సంస్థలు అభివృద్ధి చెందాలని ఆయన పిలుపునిచ్చారు ముఖ్యంగా రాజపేట మండలం పట్టణ కేంద్రం కొత్త మండలాలు అభివృద్ధి అవుతుంటే రాజపేట మండలం వెనుకబడి పోతుందని పట్టణ కేంద్రంలో చాలా దారుణంగా ఉంది రోడ్డు బాగాలేదు బస్టాండు నిర్మాణం చేయాలని ఆయనే అన్నారు. ఈ పొట్టి బత్తిని వెంకటేశం కాసుల భాను నరిశెట్టి కనకయ్య శ్రీరాములు భద్రయ్య ప్రింటికూరి మహేష్ చెరుకూరి కమలాకర్ బ్రహ్మచారి రాజ నరసయ్య శంకరయ్య తదితరులు పాల్గొన్నారు బిక్షపతి పోచయ్య కార్యక్రమంలో రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మంచాల వీరేశం ఇన్చార్జి నవీన్ కుమార్ సీనియర్ నాయకులు ఠాగూర్ అజయ్ పాల్ సింగ్ కుమార్

## 77వ భారతస్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

**హైదరాబాద్ ఆగస్టు 15/సమ సమాజం:** .సింగరేణికానీ గిరిజనసమాఖ్య భవన్ వద్ద సీపిఐ ఐ.ఎస్.డివిజన్ కార్యదర్శి షేక్.మహమూద్ ఆద్వర్యంలో 77వ భారతస్వాతంత్ర్య దినోత్సవం చేపట్టిన కార్యక్రమంలో సీపిఐ సీనియర్ నాయకులు ఆర్.శంకర్ నాయక్ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా శంకర్ నాయక్,మహమూద్ లు మాట్లాడుతు దేశ సమరయోదుల కళలు కన్న రాజ్యం రాలేదన్నారు.రోజురోజుకు దేశం అభివృద్ధి తిరోగమిస్తుందని,ప్రస్తుతం దేశ రాజకీయలు మతాల పేరిట ప్రజలను విడకొడతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల ఆవేశాలకు ఏ ప్రభుత్వం నిలబడదనే విషయాన్ని రాజకీయనాయకులు గుర్తు పెట్టుకోవాలని చెప్పారు.ఎటువంటి పరిస్తితులలో ప్రజలుఅప్రమత్తంగా ఉండాలని ఆశపడ్డారు.మరోసారి అందరికీ దేశస్వాతంత్ర్యదనోత్సవ శుభాకాంక్షలు తెలిపారు... కార్యక్రమంలో సిపిఐ నాయకులు అమీనా ,చక్రిబాయ్,అంజయ్య ,రాజు నాయక్,దశరథ్ నాయక్. ,పండు నాయక్.... వెంకటేష్.,చారి... అరవయ్య రేష్మ ,అజీమ్..... అంజుమ్.... జమీర్.... భాస్కర్ ....ఇక్బాల్.... అనూష.... నహీం... తదితరులు పాల్గొన్నారు

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in